1
# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
## నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | మార్చి 25, 2024 | www.navatelangana.com

## నూతన అధ్యక్షునికి సన్మానం



**నవతెలంగాణ-మద్నూర్**

కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన ధరాస్ సాయిలును ఆదివారం చిన్న ఎక్లార గ్రామస్తులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు ధరాస్ సాయిలు ఆధ్వర్యంలో మరింత బలోపేతం అవుతుందని వారు పేర్కొన్నారు. పల్లె గ్రామాల ప్రజలకు మండల కేంద్రంలో ఉండే ధరాస్ సాయిలు పార్టీ పరంగా ఎవరికి ఎలాంటి సమస్యలు వచ్చినా ముందుంటారని సన్మాన కార్యక్రమంలో తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వాముల పాదయాత్ర



**నవతెలంగాణ-మద్నూర్**

మండలంలోని మహారాష్ట్ర సరిహద్దులు గల సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్తున్న భక్తులకు వై.గోవింద్ ఆధ్వర్యంలో మేనూర్ గ్రామస్తులు భక్తులకు చల్లటి తాగునీరు అరటి పండ్లు స్వచ్ఛందంగా అందజేశారు. వేసవికాలంలో పాదయాత్రగా వెళ్తున్న భక్తులు మేనూరు గ్రామంలో ఏర్పాటు చేసిన చల్లటి తాగునీటి వ్యవస్థ అరటి పండ్ల పంపిణీతో భక్తులు మేనూర్ గ్రామస్తులకు మీ సేవలు అభినందనీయమని ఆశీర్వదించారు. ఇలాంటి సేవల్లో ఎప్పటికీ గొప్ప మనసుతో వై.గోవిందు ముందుండి స్వచ్ఛందంగా సేవలు చేయడంలో ప్రజల ద్వారా మన్ననాలు పొందుతున్నారు.



సదాశివనగర్‌లో హోలీ వేడుకల్లో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

# ఘనంగా హోలీ వేడుకలు

- రంగులు చల్లుకుంటూ సంబురపడ్డ చిన్నాపెద్ద

**నవతెలంగాణ-రెంజల్**

హోలీ వేడుకలు ఆదివారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. చిన్నపెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ సంబురపడ్డారు.

రెంజల్ మండలం దూపల్లి గ్రామంలో రాత్రి ప్రధాన కూడలి వద్ద కామ దహనం చేపట్టి ఆదివా రం ఉదయం హోలీ సంబురాలు చేపట్టారు. మండలం లోని రెంజల్, దూపల్లి, నీలా, బోర్గం, గ్రామాలలో సార్గమ్మ ఉన్నందున ఒకరోజు ముందుగానే హెూలీ పండుగను నిర్వహించుకున్నారు. రెంజల్, దూపల్లి గ్రామాలలో హెూలీ పండుగను పురస్కరించుకొని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి.

రెంజల్ మండలం వీరన్న గుట్ట గ్రామంలో ఆదివా రం హెూలీ పండుగను పురస్కరించుకొని రంగులు చల్లుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నా రు. గ్రామంలోని ప్రధాన రోడ్డు పక్కన గల ఎల్లమ్మ తల్లి విగ్రహం వద్ద వారు హెూలీ పండుగ సంబరాలు ప్రారం భించి స్నేహితులతో హెూలీ పండుగ జరుపుకోవడం విశేషం.

**వర్ని** : చందూర్, ఘన్‌పూర్ గ్రామాల్లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు.

**సాలూరలో హెూలీ సంబరాలు..**

**బోధన్** : సాలూర మండల కేంద్రంలో ఆదివారం గ్రామస్థులు హెూలీ సంబరాలను ఘనంగా నిర్వహించు కున్నారు. శనివారం రాత్రి కామదహనం జరిగిన తర్వాత ఆదివారం హెూలీని చేపట్టారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా గ్రామస్తులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని హెూలీ పండగను నిర్వహించుకున్నారు. అనంతరం అలా య్ బలాయ్ చేసుకుని హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. సాంప్రదాయబద్ధంగా మరికొందరు డప్పుల చప్పుళ్లతో హెూలీ వేడుకలు నిర్వహించారు. దాంతో గ్రామం సందడిగా మారింది.

**నాగిరెడ్డిపేట్** : నాగిరెడ్డిపేట మండలంలోని చేను గ్రామంలో ఆదివారం రోజు హెూలీ సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు.

**దోమకొండ** : దోమకొండ మండల కేంద్రం లోని ఆయా వార్డులలో యువకులు, చిన్నారులు హెూలి పండ గ సందర్భంగా రగులు చల్లుకుంటూ వేడుకలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు గౌడ్, నాగరాజు, శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# చేరికల పర్వం..



- కాంగ్రెస్, బీజేపీ మధ్య ద్విముఖ పోటీ

**నవతెలంగాణ-మద్నూర్**

జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలు నువ్వా నేనా అన్న రీతిలో కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీల మధ్య ద్విముఖ పోటీ గట్టిగా కొనసాగే అవకాశాలు ఉన్నట్టు మారుతున్న రాజకీయ సమీకరణాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రోజు రోజుకు పార్టీ మారుస్తూ కాంగ్రెస్, బీజేపీ పార్టీలో చేరికల పర్వం జోరుగా కొనసాగుతుంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తుంటే ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారో అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ పేరు ఖరారు అయింది. అదేవిధంగా బీజేపీ పార్టీ అభ్యర్థిగా తాజా మాజీ ఎంపీ బీబీ పాటిల్ జుక్కల్ నియోజకవర్గానికి చెందిన పేరు ఖరార్ అయింది. ఇక బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్ పేరు ఖరారు అయినప్పటికీ ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇతర పార్టీలోకి జంప్ అవుతున్నారు.

దీనితో రాబోయే పార్లమెంటు జహీరాబాద్ ఎన్నిక గట్టి పోటే కనిపిస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ముందుకెళ్తుంది. ప్రతిరోజు ఎక్కడ చూసినా చేరికల పర్వమే కనిపిస్తుంది. క్షేత్రస్థాయిలోకి దిగి ప్రచారం చేపట్టనప్పటికీ చేరికల కోసం పార్టీ అభ్యర్థులు గ్రామాలకు వెళ్తున్నారు.

జహీరాబాద్ పార్లమెంటు పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి నారాయణఖేడ్, ఆందోల్, జహీరాబాద్ ఈ విధంగా జహీరాబాద్ పార్లమెంటు పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో జుక్కల్, ఎల్లారెడ్డి, జహీరాబాద్, ఆందోల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు బాన్సువాడ, నారాయణఖేడ్, ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక మిగిలిన కామారెడ్డి ఒక్కటే బీజేపీ ఎమ్మెల్యే ఉన్నారు. ఎమ్మెల్యేల పట్టు చూస్తుంటే కాంగ్రెస్‌కు జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో మంచి పట్టు ఉంది. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ఇద్దరూ ఉన్నప్పటికీ ఆ పార్టీ నాయకులంతా కాంగ్రెస్, బీజేపీ పార్టీలలో చేరడం ఆ పార్టీ బలం పూర్తిగా తగ్గిపోతుంది. బిజెపి ఒకే ఒక ఎమ్మెల్యే కామారెడ్డిలో మాత్రమే ఉన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో బలం లేకపోలేదు. ఏది ఏమైనప్పటికీ జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల మధ్య ద్విముఖ పోటీ జరిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. గెలుపు ఎవరిదో మే 13న పోలింగ్ జూన్ 4న కౌంటింగ్ అప్పటివరకు వేచి చూడాల్సిందే.



# పిడిగుద్దులాటకు సర్వం సిద్ధం

- నేడు హున్సాలో పిడిగుద్దులు
- సాంప్రదాయం ముసుగులో ఘర్షణలకు పాల్పడితే కేసులు : ఎస్ఐ

**నవతెలంగాణ-బోధన్**

సాలూర మండలం హున్సా గ్రామంలో ప్రతి ఏటా హెూలీ పండుగ సందర్భంగా నిర్వహించే పిడుగుద్దులాటకు సర్వం సిద్ధమూంది. ఆదివారం రాత్రి హెూలీ అనంతరం సోమవారం సాయంత్రం 5 గంటలకు పిడుగుద్దులాట ప్రారంభం కానుంది. దానికోసం గత వారం రోజులుగా యువకులు ప్రాక్టీస్ చేయడం గమనార్హం. గ్రామంలో జరిగే పిడుగుద్దులాటకు ఎలాంటి అనుమతి లేదని, సాంప్రదాయం ముసుగులో ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని బోధన రూరల్ సీఐ నరేష్ పేర్కొన్నారు. వివాదాలకు అతీతంగా పండగను సామరస్యంగా, శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ ఆటను తిలకించడానికి పలు రాష్ట్రాల నుండి జనం భారీగా తరలివచ్చే అవకాశం ఉంది.



నిజాంసాగర్ కాలువ

# నిజాంసాగర్ నీటి విడుదల

- కాలువలోకి ఎవరూ దిగొద్దని సూచనలు

**నవతెలంగాణ-నిజాంసాగర్/వర్ని**

మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్టు నుండి ఏడో విడత నీటిని సోమవారం సాయంత్రం నాలుగు గంటల నుండి ఆదివారం వరకు నీటిని విడుదల చేస్తున్నామని ప్రాజెక్ట్ ఇంజనీర్ శివ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టులో నీటి నిలువలు తక్కువగా ఉన్నందున రైతులు నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూటర్ల కాలువల గేట్లు అక్రమంగా ఎవరైనా తెరిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.171 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే చివరి నీటి విడుత అని, రైతులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

**వర్ని** : నిజాంసాగర్ ఆయకట్టు కింద కోతలకు వచ్చి పంట పొట్ట దశలో ఉన్న వరి పంటకు సాగునీరు అవసరమై ఉన్నందున సోమవారం (నేడు) నీటిని విడుదల చేయనున్నట్టు ఇరిగేషన్ అధికారులు సమాచారం ఇచ్చారని, కావున కెనాల్‌కు సమీపంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మోతిసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. కెనాల్ కు అతి సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు వెళ్లకుండా చూడవలసిన బాధ్యత మాజీ సర్పంచ్లకు, ఎంపీటీసీలకు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. కాలువలో ప్రవాహం ఎక్కువ ఉంటుందని, కావున కాలువల్లోకి దిగొద్దని సూచించారు.

## జగ్గని చెరువులో మునిగి ఒకరి మృతి



**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**

నాగిరెడ్డిపేట్ జగ్గని చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన జూకంటి రాజు ( 34) శనివారం రోజు జగ్గయ్య చెరువు శివారులో గేదెలను మేపుతుండగ కొన్ని గేదెలు చెరువులోకి దిగాయి. ఎంతసేపటికి గేదెలు పైకి రాకపోవడంతో వాటిని నీళ్ల నుంచి ఒడ్డుకు చేర్చాలని రాజు నీటిలోకి దిగాడు. చెరువులోతు ఎక్కువగా ఉండడంతో రాజుకు ఈత రాకపోవడంతో చెరువులో నీట మునిగి మృతి చెందాడు. శనివారం రాత్రి ఎంత వెతికినా ఫలితం లేకుండా పోయింది. ఆదివారం జగన్ చెరువులో మృతదేహం తెలడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని శవానికి మంచినామ నిర్వహించారు. తల్లి దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

## పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరుగ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీధర్‌గౌడ్ సూచించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశానుసారం నాగిరెడ్డిపేట్ మండలంలోని గోపాల్‌పేట్ గ్రామ కమిటీ ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు ఆదివారం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొరుపోతు శేఖర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా రాజపేట విక్రం, బీసీ సెల్ అధ్యక్షునిగా వీ రాజు, మైనార్టీ సెల్ అధ్యక్షునిగా కలిం, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా అంతిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు షాహిద్ పాషా, నాయకులు ఇమామ్, గులాం హుస్సేన్, సుధాకర్ మంత్రి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో అగ్నిప్రమాదం



మంటలార్పుతున్న సిబ్బంది

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

నిజామాబాద్ నగరంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగారం ప్రాంతంలో గల ఇంద్రపూర్ సమీపంలోని ప్రైవేటు ట్రాన్స్ ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఫైర్ స్టేషన్కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చి ఎలాంటి ప్రమాదంగానే ఎలాంటి ఆస్తి నష్టం నష్టం జరగకుండా చేశారు. ఈ మరమ్మతు కేంద్రానికి చుట్టు పక్కల ఇళ్ల ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

## చెరువులో దూకి వృద్ధుడి ఆత్మహత్య

- కుమారుల మృతితో మానసిక వేదన



**నవతెలంగాణ-ఎడపల్లి**

మండలంలోని జానకంపేట్ గ్రామంలోని ఓ వృద్ధుడు అశోక్ సాగర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై వంశీకృష్ణ వివరాల ప్రకారం.. బోధన్‌లోని రాకాసిపేట్‌కి చెందిన బేతి నారాయణ (62) స్థానిక హెూటల్లోనే పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మూడేళ్ల క్రితం ఇద్దరు కుమారులు మృతి చెందటంతో అప్పటి నుంచి మానసిక వేదనతో బాధపడుతున్నారు. హెూటల్లో పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన నారాయణ పనికి రాలేదని హెూటల్ యజమాని వారి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలుపగా కుటుంబ సభ్యులు అనుమానంతో గాలించగా జానకంపేట్ చెరువులో మృతదేహం లభ్యమైంది. మృతుడి అన్న గంగారాం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

- సభ్యుల పేరిట రుణాలు పొందుతున్న పలువురు వీవోఏలు
- రుణాల మంజూరులో సీసీ, వివోఏల కుమ్మక్కు..?
- పరిశీలించని ఏపిఎం, డిపిఎం అధికారులు
- సంతకాలు చూడకుండానే మంజూరు చేస్తున్న బ్యాంక్ అధికారులు

# డ్వాక్రా గ్రూపులో వీవోఏల మోసాలు

**నవతెలంగాణ-భిక్కనూర్**

మహిళలు ఆర్థికంగా బలోపేతమై కుటుంబానికి బాసటగా నిలవాలని, వారు తమ సొంత కాళ్లపై నిలబడాలనే లక్ష్యంతో మహిళా సంఘాలు ఉద్భవించాయి. పది మంది మహిళా సభ్యులు ఒక గ్రూప్‌గా ఏర్పడి బ్యాంక్‌ల నుంచి రుణాలు పొంది చిరువ్యాపారాలు, కులవృత్తులు తదితర పనులు చేసుకుంటూ రుణాలు చెల్లించుకుంటూ ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. వీరికి సహకారంగా వీవోఏలు, తదనంతరం ఏపీఎం, డీపీఎం అధికారులు పర్యవేక్షణ చేస్తుంటారు. అయితే పలువురు వీవోఏలు అక్రమాలకు పాల్పడుతున్న విషయాలు వెలుగులోకి వస్తుండటం గమనార్హం.

పదిమంది మహిళా సభ్యులు కలిసి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసుకుని ప్రతి నెల కొంత డబ్బులు చెల్లిస్తూ తీసుకునే రుణాలను స్మాల్ హెల్ప్ గ్రూప్ (ఎస్.ఎచ్.జి) సంఘాలు అని అంటారు. 20 లేదా 25 ఎస్ హెచ్ జి గ్రూప్ సంఘాలకు ఒక వివోఏ ( సి.ఎ) ని నియమిస్తారు. ఈ వివోఏ సంఘం సభ్యులు తీసుకున్న రుణాల వివరాలు రికార్డులు రాయడం, రుణాలు కావాలంటే ఐకెపి కార్యాలయంలో దరఖాస్తు చేసి రుణాలు మంజూరు చేసే విధులు నిర్వహిస్తారు.

20 లేదా 25 ఎస్ హెచ్ జి గ్రూపులు కలిపి ఒక గ్రామ సంఘం ఏర్పాటు చేస్తారు. ఒక్కో గ్రూపులో అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకొని గ్రూప్ సభ్యుల నిర్ణయం మేరకు రుణాలు కావాలని వివోఏకు తెలియజేస్తే వివోఏ ఐకెపి కార్యాలయంలో పనిచేస్తున్న సీసీలకు తెలియజేస్తారు. సీసీ ఐకెపి కార్యాలయంలో ఒక సంఘంలోని 10 మంది సభ్యులకు లక్ష రూపాయల చొప్పున రుణాలు కావాలని ఎంసిబి చేసి వివోఏలకు అందజేస్తారు. వివోఏలు గ్రూప్ సభ్యులను తీసుకువెళ్లి బ్యాంకులో ఎంసిబి పత్రాన్ని అందజేస్తే బ్యాంకు సంఘం అధ్యక్షులు ఉపాధ్యక్షుల జాయింట్ ఖాతాలో 10 లక్షల రూపాయలను మంజూరు చేస్తారు. అధ్యక్షుల ఖాతాల నుండి మిగతా సంఘం సభ్యుల ఖాతాలకు లక్ష రూపాయల చొప్పున బదిలీ చేస్తారు. తీసుకున్న రుణాలకు ప్రతి నెల అసలు వడ్డీ కలిపి కొంత డబ్బును వివో ఏ లకు చెల్లిస్తే వివో ఏలు లేదా సంఘం అధ్యక్షులు ఎవరో ఒకరు సంఘం సభ్యుల నుండి వసూలు చేసిన డబ్బులను బ్యాంకులో చెల్లిస్తారు.

బ్యాంకు నుండి రుణాలు తీసుకోవడం, సంఘం సభ్యులు సక్రమంగా చెల్లించడం అంతా బాగానే ఉంది. కానీ సంఘం సభ్యులలో పలువురి మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వివోఏలు చేతివాటం చూపిస్తున్నారు. సభ్యులు తీసుకున్న లక్ష రూపాయల రుణాలకు సుమారు 42 నెలలు చెల్లించాల్సి ఉంటే 70 నుండి 80 వసూలు చేయడం, సభ్యులు డబ్బులు ఇచ్చినా బ్యాంకులో చెల్లించకపోవడం, రికార్డులు నమోదు చేయకపోవడం వంటి చేస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

వివోఏలు కొందరు 25 సంఘాలకు రుణాలు మంజూరు చేసిన తర్వాత డబ్బులు వద్దు అనుకున్న మహిళా సంఘం సభ్యులి ఖాతా వద్ద వివో ఏల ఖాతాలు పెట్టి అధ్యక్షుల ఖాతాల నుండి నగదు బదిలీ చేసుకుంటున్నారు. వాస్తవానికి బ్యాంకు అధికారులు సంఘం అధ్యక్షులు ఖాతాలకు రుణాల మంజూరు చేసిన తర్వాత అధ్యక్షుల ఖాతాల నుండి సంఘం సభ్యుల ఖాతాలకు బదిలీ చేస్తున్న సమయంలో వివో ఏలు తమ ఖాతాలను బ్యాంకు అధికారులకు ఇచ్చి బదిలీ చేయించుకుంటున్నారు. బదిలీ సమయంలో గమనించాల్సిన బ్యాంకు అధికారులు కూడా గమనించకుండా బదిలీ చేయడం వలన రుణాలు చెల్లించే సమయంలో రుణాలు తీసుకోకుండా రుణాలు మంజూరు అయ్యాయని రికార్డులు నమోదు చేయడం సమావేశ సమయంలో వీవోఏల బాగోతం బయటపడడం వంటివి జరుగుతున్నాయి.

కామారెడ్డి జిల్లాలో తాడ్వాయి మండలం నందిగామ గ్రామంలో ఇటీవల కాలంలో ఓ వివో ఏ రుణాల మంజూరులో భారీ స్కాం చేసిన విషయం తెలిసింది. అదేవిధంగా కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరు మండలంలో ఓ వివో ఏ 10 మంది సభ్యుల పేరిట లక్ష రూపాయల చొప్పున రుణాలు తీసుకున్నట్లు సమాచారం. సమావేశ సమయంలో సంఘం సభ్యులు మేము డబ్బులు తీసుకోలేదని మా పేరిట ఎవరు డబ్బులు తీసుకున్నారని వివో ఏను నిలదీయగా నేనే తీసుకున్నానని తీసుకున్న డబ్బులు చెల్లిస్తానని వివో ఏ తెలిపినట్లు సమాచారం. సంవత్సరం గడుస్తున్న డబ్బులు చెల్లించని కారణంగా వివో ఏను నిలదీయగా డబ్బులు ఉన్నప్పుడు చెల్లిస్తా ఏం చేస్తారో చేసుకోండి అనడమే కాకుండా వివో ఏ భర్త సైతం మహిళా సంఘం అధ్యక్షురాలిని సభ్యులపై దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం.

మహిళా సంఘం సభ్యులకు రుణాల మంజూరు విషయంలో వివో ఏలు, సీసీలు కలిసి ఇష్టానుసారంగా రుణాలు మంజూరు చేయడం, మంజూరు చేస్తే సీసీలకు కమిషన్ వస్తుందని తనిఖీలు చేయకుండానే మంజూరు చేస్తున్నారు. మంజూరు అయిన తర్వాత ఎవరి ఖాతాలోకి డబ్బులు వెళ్తున్నాయో ఎవరు తీసుకుంటున్నారు పర్యవేక్షణ లోపం కారణంగా అమాయక మహిళలు డబ్బులు చెల్లించాల్సి వస్తుంది. డబ్బులు చెల్లించే సమయంలో ఎన్ని నెలలు చెల్లిస్తున్నామో తెలియక వివో ఏలు ఎన్ని నెలలు చెల్లించమంటే అన్ని నెలలు ఎక్కువగా చెల్లిస్తూ మోసపోతున్నారు. ఇప్పటికైనా ఐకెపి ఎపిఎం అధికారులు, జిల్లా డిపిఎం అధికారులు స్పందించి వివో ఏల, సీసీల బాగోతాలను, చేతివాటాలను అరికట్టాలని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

## మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన ప్రశాంత్

**నవతెలంగాణ-గాంధారి**

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గాంధారి మండల కేంద్రంలోని ఇంద్రనగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇంద్రనగర్‌కు చెందిన కాలి ప్రశాంత్ (35) గత కొన్ని సంవత్సరాలుగా తాగుడుకు బానిస అయ్యి వివిధ రకాల క్రిమినల్ కేసుల్లో ఉండి మరియు సంసార విషయాలు పట్టించుకోకుండా కుటుంబానికి దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి లోనై గాంధారిలోనే ఎల్లమ్మ గుడి వద్ద గల చింత చెట్టుకు ఆదివారం వేకువ జామున అందాజా ఒకటి గంటలకు చెట్టుకు ఉరివేసుకుని వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్.ఐ అంజనేయులు తెలిపారు. మృతుని భార్య హరిజన్ సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు ఆడపిల్లలు వైష్ణవి 14 సంవత్సరాలు, 8 సంవత్సరాలు ఉన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన సొసైటీ డైరెక్టర్లు



**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

ఇందల్‌వాయి మండలంలోని ఇందల్ వాయి సహకార సొసైటీ డైరెక్టర్లు ఆదివారం కాం గ్రెస్ పార్టీలో చేరారు. ఇందల్ వాయి మండలం లోని చంద్రాయన్ పల్లికి చెందిన గడ్డం గంగా రెడ్డి, ఇందల్ వాయి తండాకు చెందిన బదావత్ చందర్ నాయక్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. చేరిన వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఇందల్ వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోత్కూరి నవీన్ గౌడ్, ఇందల్ వాయి సహకార సొసైటీ వైస్ చైర్మన్ పాల్తీయ మారుతి, డైరెక్టర్ బదావత్ సుధాకర్, కుమ్మరి గంగాధర్. తదితరులు పాల్గొన్నారు.

## శాంభవి హైస్కూల్‌లో ఘనంగా హెూలీ సంబురాలు



**నవతెలంగాణ-బాల్కొండ**

హెూలీ పండుగ సందర్భంగా మండల కేంద్రం లోని శాంభవి పాఠశాలలో హెూలీ సంబురాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని చిన్నారి విద్యార్థిని విద్యార్థులకు హెూలీ పండగా విశిష్టత గురించి వివరించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు వివిధ రకాల రంగులతో హెూలీని నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ బొట్ల మధుసూదన్ రాజు, కరస్పాండెంట్ బొట్ల రవిన్ ప్రసాద్, ప్రిన్సిపాల్ ఇంద్రాణి, వైస్ ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఘనంగా కామదహనం



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రలో కామ దహనం

**నవతెలంగాణ-ఆర్మూర్/నిజామాబాద్‌సిటీ**

పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో ఆదివారం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కామ దహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆంజనేయ శర్మ పంతులు కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్ కుమార్ తో ప్రత్యేక పూజలు చేయించి కామ దహనం చేవారు. కమిటీ ద్వారా అందరికి గుడాల ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కామ దహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని, తెలిపారు. కాలనీ సభ్యుల ఇళ్లకు గుడాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పిల్లలు, పెద్దలు రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, హనుమాన్ ఆలయ అధ్యక్షుడు శివరాజ్ కుమార్, కాలనీ ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు కొక్కెర భూమన్న, సుంకే శ్రీనివాస్, కార్యదర్శులు కొంతం రాజు, ఎల్.సాయన్న, రాజ్ కుమార్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

ఆలూరు మండల కేంద్రంలో స్పార్ట్ యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో హెూలీ పండుగ సంబరాలు ఆదివారం నిర్వహించుకున్నారు. ఒకరినొకరు రంగులు చల్లుకొని హెూలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**నిజామాబాద్ సిటీ :** హెూలీ పండుగ సందర్భంగా నిజాంబాద్ నగరంలోని దేవి రోడ్, బస్టాండ్ చౌరస్తా వద్దగల ట్రాలీ ఆటో స్టాండ్ ప్రాంతంలో కామదహనం ఆదివారం రాత్రి నిర్వహించారు.

## ఉద్యమస్ఫూర్తితో పనిచేయాలి

- తెరసం ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్



మాట్లాడుతున్న ఘనపురం దేవేందర్

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

కవిత్వం ఖడ్గం లాంటిదని చెడును ఖండిస్తుందని, సాహిత్యం నాగలి లాంటిదని పచ్చదనాన్ని సృష్టించడానికి పాదులు వేస్తుందని అందుకే కవులు రచయితలు నిరంతరం ఉద్యమస్ఫూర్తితో పని చేయాలని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల వార్షిక సాహిత్య సభలలో ఆయన మాట్లాడారు. సమాజంలో చైతన్య రాహిత్యం ముందుతరాలకు మంచిదికాదని ప్రజాచైతన్యానికి సాహితీవేత్తలు సంఘటితంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలోని ఈ సెషన్లో డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, రూప్ కుమార్ డబ్బీకర్, పొట్లపల్లి శ్రీనివాస్, కొత్త అనిల్ కుమార్, పొన్నాల బాలయ్య , కందుకూరి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న పలువురు

**నవతెలంగాణ-ఏర్గట్ల**

నాలుగు రోజుల క్రితం కాకతీయ కాలువలో కొట్టుకువచ్చిన తొర్తి గ్రామానికి చెందిన తూము వద్ద ఆగివున్న మృతదేహానికి తొర్తి జీపీ ఆధ్వర్యంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నాలుగు రోజుల క్రితం కాకతీయ కాలువ ద్వారా కొట్టుకువచ్చిన శవానికి వైద్య పరీక్షలు నిర్వహించామని, మృతదేహన్ని ఎవరు గుర్తించకపోవడంతో తొర్తి జీపీకి అప్పజెప్పడం జరిగిందని తెలిపారు. అనంతరం శవానికి తొర్తి జీపీ ఆధ్వర్యంలో ఆదివారం అంత్యక్రియలు జరిపినట్లు తెలిపారు. ఇందులో స్థానిక పోలీసులు, గ్రామపంచాయతీ సిబ్బంది, కారొబార్లు పాల్గొన్నారు.

## ఏర్గట్లలో ఇఫ్తార్ విందు

- పాల్గొన్న ముత్యాల సునీల్ రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం సోదరులు

**నవతెలంగాణ-ఏర్గట్ల**

మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సోమా దేవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివన్నోళ్ల శివకుమార్, నాయకులు గడ్డం జీవన్, ముస్కు మోహన్ రెడ్డి, లింగారెడ్డి, జింక అనిల్, భాను, తదితరులు పాల్గొన్నారు.

# రాయితీల పేరుతో ప్రలోభాలు

- మొదలైన కార్పొరేట్ చదువుల ప్రచారం



**నవతెలంగాణ-ఆర్మూర్**

ప్రస్తుతం చదివంటే ఓ వ్యాపారమైంది. విద్యార్థులకు చదువుకోనివ్వడం.. కంటే కొనిచ్చే పరిస్థితికి దిగజారింది. ఏసి, నాన్ ఏసి, వసతిగృహాలు, ఐఐటి, నీట్ ఫౌండేషన్ల పేరుతో ప్రలోభ పెడుతున్నారు. విద్యార్థులు పదో తరగతిలో ఉన్నప్పుడే వారి తల్లిదండ్రులకు వల వేస్తున్నారు .తమ కళాశాలలో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందం టూ కార్పొరేట్ " పిఆర్వోలు కాచుకు కూర్చుంటున్నారు. పదవ తరగతి పరీక్షలు పూర్తి కాకముందు నుంచే ఉత్తమ మార్కులు వస్తే రాయితీలు కల్పించి చేర్చుకుంటామంటూ ఆశ చూపుతున్నారు. అలాగే పాఠశాలల్లోనూ పై తరగతికి చేర్చుకోవడానికి గ్రామాలు, పట్టణాలలోని పలు కాలనీలలో ప్రచారం మొదలు పెట్టినారు. తమ బిడ్డ ఉన్నత స్థాయికి ఎదగాలనే తపనతో తల్లిదండ్రులు ఆ వలలో చిక్కుతున్నా రు. చివరికి విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక పోతున్నారు. జిల్లా కేంద్రంలోని ముబారక్ నగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఒక కార్పొరేట్ కళాశాలకు ఎలాంటి గుర్తింపు రాలేదని ఇంటర్ బోర్డు అధికారి తెలిపినారు.

**మార్కులే ఉత్తమమా?**

ఒక విద్యార్థి విజేతగా ఎదగాలంటే రోజుకు 16 గంటలు చదవడం కాదు.. సకల సౌకర్యాలతో అభ్యసించ డం కాదు.. ముఖ్యంగా ఒత్తిడికి దూరంగా ఉండడం. చుట్టూ వాతావరణం హాయిగా ఉండేలా చూసుకోటవాలి. పాఠాన్ని అర్థం చేసుకుంటూ స్నేహపూరిత వాతావరణంలో చదివితే తమ మార్కులే కాదు నైతికత విలువలు పెంపొం దుతాయి. తల్లిదండ్రులు కూడా అటువంటి విద్యాసంస్థలు ఉన్నాయా అనే కోణంలో ఆలోచించాలని విద్యా నిపుణులు సూచిస్తున్నారు. గత సంవత్సరం క్రితం పట్టణంలోని ఒక విద్యార్థికి పదవ తరగతిలో 9.7 గ్రేడు వచ్చింది. ఫలితాలు రాకముందే ఆ విద్యార్థి తండ్రిని హైదరాబాద్ కు చెందిన కార్పొరేట్ కళాశాల పీఆర్వో లు ఫోన్లో సంప్రదించారు. ఫలి తాలు వచ్చాక నేరుగా ఇంటికి చేరుకున్నారు. తమ కళాశా లలో ఉత్తమ విద్యార్థులకు రాయితీ లు కల్పిస్తామని ఉత్తమ బోధనతో పాటు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు అక్కడి వసతి గృహంలో చేర్పించారు. 4 నెలలు తిరగక ముందే విద్యార్థి అక్కడ ఉండనంటూ మొండికేశాడు. దీంతో పదివేలు ఎక్కువగా చెల్లించి వసతి గృహం నుంచి తీసుకొచ్చారు. విద్యార్థిని అడిగితే సరైన సౌకర్యాలు లేవని ఉండలేక పోయానన్నారు. ఇలాంటి పరిస్థితులు ప్రతి సంవత్సరం ఎదురవుతూనే ఉన్నవి.

పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కాకముందు నుండే విద్యార్థుల వేటను ప్రారంభించారు. కళాశాలలు ప్రారంభమైతే అధిక ఫీజులు ఉంటాయని ఇప్పుడే కొంత అడ్వాన్స్ కట్టాలని నమ్మ బలుకుతున్నారు. దీంతో కొందరు తల్లిదండ్రులు అధ్యాపకుల బోధన, వసతి గృహాల సౌకర్యాలు అక్కడి వాతావరణం ఏమి చూడకుండానే కొంత డబ్బులను కట్టి పిల్లలను చేర్పిస్తున్నారు. విద్యార్థులు చేరిన తర్వాత అక్కడి పరిస్థితులను చూసి వెనక్కి వచ్చేసిన ఘటనలు ఉన్నవి. చదువుల ఒత్తిడిని భరించలేక కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నవి.

**సెలవులలో పాఠశాలలకు..**

ప్రాథమిక స్థాయి విద్యార్థులను ఉన్నత పాఠశాలలో చేర్పించేందుకు యాజమాన్యాలు సిద్ధమయ్యా. ప్రతిసారి వేసవి సెలవులలో అధ్యాపకులే పిఆర్ఓలుగా మారి విద్యార్థులను చేర్పిస్తున్నారు. యాజమాన్యాలు వారికి టార్గెట్ విధించడంతో చేసేదేమీ లేక ఇంటింటికి తిరుగుతు న్నారు. ముఖ్యంగా చుట్టుపక్కల గ్రామాల్లోని తల్లిదండ్రు లకు వల వేస్తున్నారు. కరపత్రాలను ఆకర్షణీయగా రూపొందించి సకల సౌకర్యాలు ఉన్నట్లు ప్రలోభ పెడుతున్నారు. తల్లిదండ్రుల ఎదుట ఆంగ్లంలో మాట్లాడి ఆకట్టుకుంటున్నారు. దీంతో చాలామంది ముందస్తుగానే డబ్బులు చెల్లించి తమ పిల్లలను చేర్పిస్తున్నారు.

**అదనపు వసూలు**

పాఠశాలల్లో చేర్పించే ముందు రాయితీలు అంటూ వల వేస్తున్నారు. చేర్పించాక అసలు సంగతి బయటపడు తుంది. పాఠశాలల్లో ఏకరూప దుస్తులు, టై బెల్టు పుస్తకాలు నోట్ బుక్కులు అంటూ ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఈ సామాగ్రిని పాఠశాలల్లో, కళాశాలల్లో విక్రయించకూడదు. అధికారుల అలసత్వంతో ఏటా ఈ తతంగం కొనసాగుతుంది.

**ఉభయ జిల్లాలలో..**

ఉమ్మడి జిల్లాల నుండి సుమారుగా 35 వేల మంది విద్యార్థులు ప్రతి సంవత్సరం 10వ తరగతి లో ఉత్తీర్ణులవుతున్నారు. సుమారుగా 8 నుండి 10 వేల మంది హైదరాబాదులోనే అభ్యసిస్తున్నారు. ఇందులో సగం మంది పిఆర్ఓ వలలో పడినవారు ఎందరో ఉన్నారు.

**పట్టణంతో పాటు..**

ఆర్మూర్ పట్టణంతో పాటు నూతన మండలాలు చుట్టుపక్కల గ్రామాలలో 500 కు పైగా ప్రైవేటు పాఠశాల లు ప్రచారాన్ని ఉధృతం చేయడం గమనార్హం.

# తానాకుర్ధిలో చిన్నారుల హెూలీ



**నవతెలంగాణ-మోపాల్**

మండలంలోని తానాకుర్ది గ్రామంలో ఆదివారం హోలీ నిర్వహించారు. గ్రామప్రజలందరూ కలిసి ఎటువంటి తార తమ్యాలు లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని పండుగను ఆనందంగా జరుపుకున్నారు. చిన్న పిల్లల కేరింతలు వారి హెూలీ ఆట చూసి కన్నుల విందుగా కనిపించింది.

**రంగుల్లో మునిగితేలిన చిన్నారులు**

**కమ్మర్‌పల్లి :** మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం హెూలీ పండుగ సంబరాలు అంబరాన్ని అంటాయి. గ్రామాల్లో చిన్న పెద్ద తేడా లేకుండా చిన్నారులు, మహిళలు, యువకులు హెూలీ శుభాకాంక్షలు చెప్పుకుంటూ, రంగులు పూసుకుంటూ సంబరాలు చేసుకున్నారు. చిన్నారులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. మండలంలోని బషీరాబాద్ లో మాజీ సర్పంచ్ సక్కారం అశోక్ గ్రామ యువకులతో కలిసి హెూలీ సంబరాల్లో పాల్గొన్నారు.

**డిచ్‌పల్లి :** డిచ్‌పల్లి, ఇందల్ వాయి మండలాలలోని కొన్ని గ్రామాల్లో శనివారం రాత్రి కామ దహనం చేశారు. ఆదివారం హెూలీ పండుగ సంబరాలు జరుపుకున్నారు. యువకులు, చిన్నారులు ఒకరినొకరు రంగులు వేసుకుని సంబరాలు ఘనంగా నిర్వహించారు.

**బాల్కొండ :** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో ఆదివారం హెూలీ పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు రంగులు పూసుకుంటూ హెూలీ పండుగ శుభాకాంక్షలు తియజేసుకున్నారు. ఈ సందర్భంగా బాల్కొండ మండల ప్రజలందరికీ ఎస్సై కే గోపి హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు .ఈ సంబరాలలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గురువు పాత్ర కీలకం

- రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకర్ శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సన్మానించిన పలువురు

**నవతెలంగాణ-ఆర్మూర్**

దేశంలో గురువు పాత్ర గొప్పదని, డిగ్రీ కళాశాల అధ్యాపక పోస్టుల్లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకర్ ఉప్పల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అంకాపూర్ గ్రామంలో ని భార్గవి విద్యానికేతన్ హైస్కూల్లో విద్యార్థులకు ఆదివా రం అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ "విద్యా ర్థుల విద్యాభివృద్ధికి గురువు యొక్క ప్రాముఖ్యత వెలకట్ట లేనిదని, రాయి లాంటి విద్యార్థులను శిలావిగ్రహంగా మార్చే వ్యక్తి శిల్పి లాంటి గురువు మాత్రమేనని అన్నారు. విద్యార్థిలోని నైపుణ్యాలను తీర్చిదిద్దే వ్యక్తి...గురువుని తెలి పారు. సైన్స్ సబ్జెక్ట్ పైన భవిష్యత్తు కార్యాచరణ , విద్యార్థి దశ నుంచే పట్టుదల లక్ష్యం సమయపాలన ఏర్పరచుకో వాలని, ప్రతి గురువును గౌరవించి వారు చెప్పిన అంశాలను చక్కగా జీవితంలో అలవర్చుకుంటే ఉన్నత స్థానంలో నిలుస్తారని అన్నారు. భవిష్యత్తు కార్యాచరణ ఇప్పటినుండే ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని వారు తెలిపారు. తులసి పట్వారీ వారి గురువు అయిన శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ పట్వారీ గోపీ కృష్ణ, ప్రిన్సిపాల్ పట్వారి ప్రగతి విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

# పలు బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధితున్ని పరామర్శిస్తున్న ముత్యాల సునీల్‌కుమార్

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

మండలంలోని హాసకొత్తుర్ గ్రామంలో పలు బాధిత కుటుంబాలను ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. గ్రామానికి చెందిన ఎల్ల రమేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. అదే గ్రామానికి చెందిన రాజేందర్ వాళ్ల నాన్న లింబాద్రి ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలు విరగడంతో వైద్యులు కాలును తొలగించారు. ఆయనను పరామ ర్శించి ధైర్యాన్ని కల్పించారు. గ్రామానికి చెందిన మేకల క్రాంతి వాళ్ల నాన్న అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనను పరామర్శిం చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలెపు నర్సయ్య, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

**వేల్పూర్ మండలంలో..**

మండలంలోని కుకునూర్ గ్రామానికి చెందిన మర్రి నారాయణ ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. వేల్పూర్ మండలం మోతే గ్రామానికి చెందిన తిరుపతి ఇటీవల జరి గిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలికి శస్త్రచికిత్స చే యించుకున్నాడు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించి ఆరోగ్య సమాచారాన్ని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు ఆయన వైద్య ఖర్చుల కోసం రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులుఉన్నారు.

# బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



మృతి చెందిన సాయిలు

**నవతెలంగాణ-మాక్లూర్**

బైక్ అదుపుతప్పి యువకుడు మృతిచెం దాడు. ఈ ఘటన మండలంలోని కల్లెడ గ్రామ శివారులో ఆదివారం చోటుచేసు కుంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని మానిక్‌బండారు గ్రామ శివారులోని మహాలక్ష్మి నగర్ కాలానికి చెందిన కొలపాక సాయిలు(24) ఈ నెల 17వ తేదీన మేస్త్రి పని చేయడానికి ఆలూర్ మండల కేంద్రానికి వెళ్ళాడు. హెూళీ పండుగ కోసం ఆలూరు నుంచి వెళ్తుండగా.. కల్లెడ, చిన్నాపుర్ గ్రామాల మధ్య అతివేగంగా బైక్ నడుపడంతో బైక్ అదుపుతప్పి రాయిని ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలైన ఆయన అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుని అన్న కోలపాక నర్సింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

- వైస్ ఛాన్స్‌లర్‌కు వినతి



వీసీని సన్మానిస్తున్న పలువురు

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

తెలంగాణ యూనివర్సిటీలో నెలకోని ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని కోరుతూ తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్‌యుఐ కమిటీ అధ్వర్యంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బుర్ర వెంకటేశంకు యూనివర్సిటీ లో ఆదివారం కలిసి సన్మానించి, వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ యూనివర్సిటీ అధ్యక్షులు కోమిర శ్రీశైలం మాట్లాడుతూ యూనివర్సిటీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని, యూనివర్సిటీలో బాలికల వసతి గృహం ఇంకోక్కటి అత్యవసరంగా ఉందని, ఆడిటోరియం, ఇంటిగ్రేటెడ్ ఐదు సంవత్సరాల కోర్సులకు ప్లేస్‌మెంట్ కల్పించాలని, లైబ్రరీలో కాంపిటేటీవ్ పుస్తకాలు అందుబాటులో ఉంచాలని, గత 2 రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, యూనివర్సిటీలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందిని రెగ్యులరైజేషన్ చేయాలని ఇంచార్జీ వైస్ ఛాన్సలర్, హాయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం కు వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు రాజేందర్, బానోత్ సాగర్ నాయక్, నాయకులు విజయ్, నిరంజన్, శ్రీకాంత్, బాలాజీ తదితరులు ఉన్నారు.

# సొసైటీ అవినీతిపై ఫిర్యాదు చేస్తాం



మాట్లాడుతున్న వేణుగోపాల్ యాదవ్

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

మండలంలోని కోన సముందర్ సొసైటీలో రూ.కోటికి పైగా జరిగిన అవినీతిపై జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఫిర్యాదు చేయనున్నట్లు టిపిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కోనసముందర్ సొసైటీలో గడిచిన బిఆర్ఎస్ పదేళ్ల ప్రభుత్వంలో గత నాలుగు సంవత్సరాలలో వరి కొనుగోలు కమీషన్ రూ.60 లక్షలు వచ్చాయన్నారు. అదేవిధంగా ఫర్టిలైజర్, సీడ్ కమిషన్ ద్వారా నాలుగు సంవత్సరాలలో రూ.20 లక్షల కమీషన్ల రూపంలో సొసైటీ ఆదాయం వచ్చిందన్నారు. గ్రామ రైతులు విండో మహాజన సభలో సొసైటీ చైర్మన్ సామ బాపురెడ్డిని, సొసైటీ కార్యదర్శి రాజేశ్వర్‌లను నిలదీస్తే పొంతనలేని సమాధానాలు చెప్పారన్నారు. మాకు సంబంధం లేదు అంటూ ఒకరికొకరు తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఎవరికి వారు తప్పించు కుంటుంటే సొసైటీకి వచ్చిన నిధులు ఎక్కడికి పోయాయని గ్రామ రైతు నాయకులు నిలదీసినట్టు తెలిపారు.

సొసైటీకి తాళం వేసే పరిస్థితికి రైతులు వచ్చారంటే కార్యదర్శి, చైర్మన్ ల అవినీతి బాగోతం ఏ స్థాయికి వచ్చిందో స్పష్టంగా కనపడుతుందని అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో స్థానిక శాసన సభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి సహకార సంఘాలను అవినీతి కుంపటిగా తయారు చేశారని విమర్శించారు. అవినీతికి పాల్పడ్డ బిఆర్ఎస్ నాయకులను కాపాడుతూ వచ్చారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఉన్న నాయకుల అవినీతి వల్లే ఈరోజు సొసైటీలు నష్టాల్లో మునిగిపోయాయన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో సొసైటీల్లో అవినీతి మొక్కలను పెంచింది మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి అని వేణుగోపాల్ యాదవ్ విమర్శించారు. అవినీతి పరులను కాంగ్రెస్ ప్రభుత్వం వదిలిపెట్టబోదని హెచ్చరించారు. కోన సముందర్ సొసైటీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని, నిధులు స్వాహా చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకునేటట్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకేట రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి తక్కురి దేవేందర్, కిషన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగేల ప్రవీణ్, నాయకులు పాలెపు నరసయ్య, బుచ్చి మల్లయ్య యాదవ్, గంగారెడ్డి, ఉట్నూర్ ప్రదీప్, గోపి లింగారెడ్డి, జెడి శ్రీనివాస్, సుధాకర్, సతీష్, భూమారెడ్డి, సింగిరెడ్డి శేఖర్, కుందేటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన రామకృష్ణ గుప్తా



**నవతెలంగాణ-కామారెడ్డి/లింగంపేట్**

హైదారాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జహీరాబాద్ బిజెపి ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ ప్రధాన అనుచరుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, సెన్సార్ బోర్డు సభ్యులు కామారెడ్డి జిల్లాకు చెందిన అతిమాముల రామకృష్ణా గుప్త మాజీ ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి సమక్షంలో ఆదివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బిజెపిలో చేరుతున్నట్టు తెలిపారు. గత పదేళ్లుగా ఎంపీ బీబీ పాటిల్ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు విశేషంగా కృషి చేస్తానన్నారు.

## మండలాధ్యక్షుడిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్**



మండలాధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డిని నియమించడంతో ఆయన్ను కాంగ్రెస్ నాయకులు ఆదివారం మండల కేంద్రంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా మూడవసారి ఎన్నికైన సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాపై ఎంతో నమ్మకంతో మూడవసారి మండల అధ్యక్షుని బాధ్యతలు అప్పజెప్పినందుకు రానున్న ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేస్తానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలతో పాటు ఇతర ఏ ఎన్నికలైనా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేవిధంగా కృషి చేస్తానని వివరించారు. కార్యక్రమంలో సంతోష్ దేశాయ్, సాయిరెడ్డి, బసవరాజ్ దేశాయ్, కాంత రెడ్డి, విట్టల్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా హోలీ..

- పలు గ్రామాల్లో ఆనందోత్సవాల మధ్య వేడుకలు
- అన్నీ కృత్రిమ రంగులే
- కనిపించని గోగుపువ్వు

**నవతెలంగాణ-విలేకరుల బృందం**

ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో ఆదివారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతిఒక్కరూ హోలీవేడుకల్లో పాల్గొని ఆనందంగా గడిపారు.

**సదాశివనగర్ :** మండలంలోని పలు గ్రామాల్లో రంగోళి పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కల్వరాల్, మొడేగాం, ఉత్నూర్, సదాశివనగర్ తదితర గ్రామాల్లో రంగోళి పండుగను జరుపుకున్నారు. ఎక్కడ చూసినా కృత్రిమంగా తయారు చేసిన రంగులతోనే హోలీ పండుగ జరుపుకున్నారు. ఎక్కడ కూడా గోగుపువ్వు కనిపించలేదు.

**లింగంపేట్ :** మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం హోలీ సంబరాలను జరుపుకున్నారు. మండలంలోని ముస్తాపూర్, గాంధీనగర్, లింగంపల్లి, మంబోజిపేట్, రాంపల్లి, లింగంపేట్‌తో పాటు ఆయా గ్రామాల్లో హోళీ వేడుకలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు, యువకులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రంగులు చల్లుకుంటూ హోళీ సంబురాల్లో ఆసక్తితో పాల్గొన్నారు.

**గాంధారి :** మండల కేంద్రంలో బంజారాల సాంస్కృతిక ప్రతీక అయిన హోలీ పండుగ కార్యక్రమాన్ని సేవాలాల్ మందిర ప్రాంగణంలో ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. నిర్వహణ కమిటీ ఉదయం 9 గంటల నుంచి ఆయా తండాల నాయక్ కార్బరి, జడ్పీటిసి శంకర్ నాయక్, ఎంపీపీ రాధ బలరాం తదితరులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 44 తండాల నుంచి సుమారు 1000 మంది తండా వాసులు పాల్గొని ఆడుతూ పాడుతూ హోలీ సంబరాలు నిర్వహించారు. తమ కుల దైవాలైన సంత్ సేవాలాల్ మహారాజ్‌ను స్మరిస్తూ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మోతీరాం, మోహన్ నాయక్, సర్దార్ నాయక్, సకారం, గబ్బర్‌సింగ్, రవికుమార్, దేవిసింగ్, ప్రేంసింగ్, ఆలిండియా బంజారా సేవా సంఘం కామారెడ్డి అధ్యక్షుడు బద్యానాయక్, వైద్యులు శ్రీకాంత్, ప్రకాష్, ఉద్యోగులు హీరాలాల్, ప్రకాష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

**పిట్లం :** మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లతోపాటు, ఆయా కాలనీలలోని యువతీ యువకులు, చిన్నారులు ఆదివారం హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, పెద్దలు సహజ సిద్ధమైన రంగులతో ఒకరికొకరు రంగులు చల్లుకొని హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పెద్దలు, చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.



లింగంపేట్ : హోలీ వేడుకల్లో చిన్నారులు



రెంజల్ : రంగులు పూసుకుంటున్న మహిళలు



పిట్లం : సహారా కాలనీలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



గాంధారిలో..



దోమకొండలో రంగులు పూసుకుంటున్న యువకులు

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరికి గాయాలు
- కారు బోల్తాకొట్టడంతో ఘటన



బోల్తాపడి నుజ్జునుజ్జయిన కారు



సుధీర్ (ఫైల్)

**నవతెలంగాణ-పెద్దకొడపగల్**

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని చిన్నతక్కడపల్లి వద్ద 161వ జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై కోనారెడ్డి వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 10 గంటల సమయంలో సింగీతం చైతన్ అనే వ్యక్తి బిచ్కుంద గ్రామానికి చెందిన సుధీర్ ఇంటికి వచ్చి కొత్త కారు కొన్నానని కారులో చిన్న తక్కడపల్లి వరకు వెళ్లి వద్దామని చెప్పి ఇంటి నుంచి తీసుకెళ్లారు. చేతన్ కారు నడపగా ముందు సీట్లో సుధీర్ కూర్చున్నాడు. ఇంటి నుంచి బయలుదేరిన వాళ్ళ రాత్రి 12 గంటల సమయంలో 161వ జాతీయ రహదారిపై చిన్నతక్కడపల్లి నుంచి బిచ్కుంద వైపు మలుపుతుండగా కారు అదుపుతప్పి పక్కనే ఉన్న సైన్ బోర్డును ఢీకొని గుంతలో పడిపోయింది. ఈ ప్రమాదంలో సుధీర్ అనే వ్యక్తికి తలపై, ఇతర చోట్ల బలమైన గాయాలయ్యాయి. అదే సమయంలో చైతన్‌కు గాయాలయ్యాయి. అనంతరం పోలీసులు స్థానికులు కలిసి చికిత్స నిమిత్తం వారిని బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. సుధీర్ బాన్సువాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. చైతన్ అతివేగం అజాగ్రత్త వల్ల కారు నడపడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. మృతుని భార్య చిన్‌సాబ్ రేఖ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు

**నవతెలంగాణ-కామారెడ్డి**

బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రధాన నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు మీసాల సత్తయ్య, బిఆర్ఎస్ పార్టీ బీబీపేట మండల కార్యదర్శి దోమల సిద్ధ రాములు, బీబీపేట్ పట్టణ కార్యదర్శి మాణిక్య ఎల్లం, నాయకులు ఎల్లబోయిన బాలయ్య, బోయిని సత్యం, కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి, మహమ్మద్ అలీ షబ్బీర్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ పట్ల ప్రజలు, ఇతర పార్టీ నాయకులు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణంతో పాటు, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పది లక్షల వరకు వైద్య సేవలు ఉచితంగా అందిస్తుందన్నారు. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ ధరను రూ.500లకే అందిస్తామన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చే పథకాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఇల్లు నిర్మించుకునే వారికి ఐదు లక్షల రూపాయలు ఇస్తూ, రైతుబంధును ఎకరాకు పదిహేను వేల రూపాయలను అందించబోతున్నట్టు పేర్కొన్నారు. త్వరలోనే వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు 4000 రూపాయలు పెన్షన్ అందిస్తామన్నారు. ఇలాంటి జనరంజక పథకాల ద్వారా పేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని వివరించారు. రాబోయే ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీబీపేట మండల పార్టీ అధ్యక్షుడు సుతారి రమేష్, ఐరన్ సందీప్, నాయకులు పాత రాజు తదితరులు పాల్గొన్నారు.



బోధన్ : సాలూరా మండల కేంద్రంలో కుస్తీలో తలపడుతున్న మల్లయోధులు



## హోరాహోరీగా కుస్తీ పోటీలు

**నవతెలంగాణ-బోధన్/రెంజల్**

సాలూర మండల కేంద్రంలో హోలీ పండుగను పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ఈ కుస్తీ పోటీలో సమీప గ్రామాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, బీదర్ నుంచి వచ్చిన మల్లయోధులు తలపడ్డారు. అధ్యంతం ఆసక్తికరంగా సాగిన కుస్తీ పోటీలో ప్రేక్షకులకు ఆకట్టుకున్నాయి. అనంతరం కుస్తీ పోటీలో విజేతలకు నగదు బహుమతి అందించారు. కుస్తీ పోటీల సందర్భంగా నిర్వాహకులు సరైన విధంగా ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు కలిగాయి. మల్లయోధులు కుస్తీలో తలపడడానికి విశాలంగా ప్రాంగణం లేక ప్రేక్షకులకుపై వచ్చి పడిన ఘటనలూ చోటుచేసుకున్నాయి. అలాగే గ్రామపెద్దలకు, పాత్రికేయులకు కూర్చోడానికి సరైన ఏర్పాట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడవలసి వచ్చింది. సంవత్సరాల నుంచి ఇదే మూస ధోరణిలో కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేయకపోవడంతో గ్రామ పెద్దలు, మల్లయోధులు ఇబ్బందులు పడవలసి వచ్చింది. ఇప్పటికైనా నిర్వాహకులు ఆలోచించి వచ్చే సంవత్సరం నుంచి కుస్తీ పోటీలను సరైన సౌకర్యాలు కల్పించి నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, మల్లయోధులు కోరుతున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకట్ పటేల్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, బుద్దె రాజేశ్వర్, అల్లె రమేష్, శంకర్ పటేల్, సురేష్ పటేల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

**పలు గ్రామాల్లో కుస్తీ పోటీలు..**

**రెంజల్ :** మండలంలోని దూపల్లి, రెంజల్, సాటాపూర్ గ్రామాలలో హోలీ పండుగను పురస్కరించుకొని కుస్తీ పోటీలను నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు రూ.2000 నగదును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు లింగన్న యాదవ్, తాజా మాజీ సర్పంచులు ఎమ్మెస్ రమేష్ కుమార్, శనిగరం సాయిరెడ్డి, బాబన్న, పిట్ల భూమేష్, జాడి సాయిలు, ఉపసర్పంచ్ సాయిలు, జబ్బర్, తదితరులు పాల్గొన్నారు.



రెంజల్ మండలంలో కుస్తీపోటీలు

## కెమికల్ కంపెనీతో ఆ ప్రజాప్రతినిధికి సంబంధమేంటి..?

**నవతెలంగాణ-భిక్కనూర్**

కెమికల్ కంపెనీతో తీవ్ర గాలి, నీరు కాలుష్యం అవుతూ మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఓ ప్రజా ప్రతినిధి కెమికల్ కంపెనీకి వత్తాసు పలకడం గమనార్హం. ప్రజలు కంపెనీపై ఎదురు తిరిగిన ప్రతిసారి ఆ ప్రజా ప్రతినిధి కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి సెటిల్మెంట్ చేస్తూ ఆందోళనలు చేయకుండా చూస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎవరు గట్టిగా మాట్లాడిన, ఎవరు ఎదురు తిరిగినా కంపెనీ తరఫున ఆ ప్రజా ప్రతినిధి మాట్లాడుతూ ఎదురు తిరిగిన గ్రామానికి, ప్రజలకు కంపెనీలో ఉద్యోగం పెట్టడం, ఊరికి, కులానికి ఏదో ఒక రూపంలో సహాయం చేసి ఎవరు మాట్లాడకుండా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కెమికల్ కంపెనీ ద్వారా ఒకవైపు ప్రజలు, వృద్ధులు, చిన్నారులు అనారోగ్యం పాలవుతున్న కంపెనీ నుండి వచ్చే కెమికల్ వాసన సమస్యను పరిష్కరించాల్సింది పోయి కంపెనీకి వత్తాసు పలకడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎదురు తిరిగిన ప్రతిసారి ఏదో ఒక రూపంలో ఆశ చూపి ఎవరు మాట్లాడకుండా చేయడం సమస్య రాకుండా చేస్తానని కంపెనీ తరపున మాట్లాడడం పరిపాటిగా సాగుతుందని బాధితులు తెలిపారు. ఊపిరి ఆడకుండా చేస్తున్న ప్రజల ప్రాణాల కంటే కెమికల్ కంపెనీనే ముఖ్యమా..? అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఆ ప్రజా ప్రతినిధి ప్రజల తరుపున ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని ప్రజల తరఫున పోరాటం చేయాలి కానీ కంపెనీ కోసం కాదని భవిష్యత్తులో మండల ప్రజలు ముఖ్యమే కానీ కంపెనీ యాజమాన్యం ముఖ్యం కాదని బాధితులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

# బీఆర్ఎస్‌కు బిగ్‌షాక్

- ఖాళీ అవుతున్న కారు పార్టీ
- కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ, సర్పంచులు, డైరెక్టర్లు



కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీపీ, సర్పంచ్, డైరెక్టర్

**నవతెలంగాణ-లింగంపేట్**

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ఆదివారం లింగంపేట్ ఎంపీపీతో పాటు పలువురు సర్పంచులు, సింగిల్‌విండో డైరెక్టర్లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో లింగంపేట్ మండలం ఎంపీపీ గరీబు న్నీసా నయిమ్, అయ్యపల్లి మాజీ సర్పంచ్ శంకరప్ప, లింగంపేట్ సొసైటీ డైరెక్టర్ అట్టెం శ్రీనివాస్, నీరుడి రామలింగం, పోచమ్మ కాడి సత్యం, అయ్యపల్లి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల చిన్న మల్లయ్య, శెట్టిపల్లి గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షుడు మన్నె బాలయ్య, అయ్యపల్లి శెట్టిపల్లి గ్రామాలకు చెందిన 30 మంది బిఆర్ఎస్ కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు ప్రజాప్రతినిధులు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో వచ్చినటువంటి హామీలను నెరవేర్చి తీరుతుందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, గృహ జ్యోతి పథకం కింద ఇంటింటికి ఉచిత కరెంటు, ఆరోగ్యశ్రీతో పాటు రైతుబంధు, రైతులకు పెట్టుబడి సాయం, ఇందిరమ్మ ఇండ్లు నిరుపేదలకు అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి పార్టీ గుర్తిస్తుందని ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని జహీరాబాద్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో లింగంపేట్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్, యూత్ మండలాధ్యక్షులు సుప్పాల రాజు, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ నగేష్, సాయికుమార్, తాడూరు వెంకట్ గౌడ్, ఫుల్ సింగ్, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

## గుండు ఎత్తాడు..

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో హోలీ పండుగ సందర్భంగా గుండు (బండరాయిని) పైకెత్తడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఆదివారం హోళీ పండుగను పురస్కరించుకుని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గుండును పైకెత్తాడు. దీంతో గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాశం సాయిలు కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.





## చదువుల తల్లికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

**నవతెలంగాణ-లింగంపేట్**

మండలంలోని కోర్పోల్‌కు చెందిన అయిలేని శైలజ అనే విద్యార్థిని పటాన్‌చెరులో నర్సింగ్ రెండవ సంవత్సరం చదువుతున్నది. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేనందున చదువు ఆగిపోయే సమయంలో హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థను సంప్రదించగా అతిమాముల రామకృష్ణ, సుధీర్‌రెడ్డి, నిట్టు వెంకట్‌రావు, బృందం సభ్యుల సహకారంతో రూ.5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆదివారం వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు తోట సాయిలు, రజనీకాంత్‌గౌడ్, కృష్ణాకర్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కష్టపడి పై స్థాయికి వెళ్లి సమాజ సేవలో ముందుండాలని అన్నారు. ఏ విద్యార్థి అయినా డబ్బులు లేవని చదువు మధ్యలో ఆపివేయకుండా తమకు తోచినంత సహాయం అందిస్తామని తెలిపారు. విద్యార్థుల చదువులకు చేదోడు వాదోడుగా నిలుస్తూ ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపుతున్న దాతలు అందరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక సాయం అందించినందుకు సంస్థ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గాండ్ల నర్సింలు, సత్యనారాయణరెడ్డి, బొల్లారం క్రాంతి కుమర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
4
సోమవారం | మార్చి 25, 2024 | www.navatelangana.com


## ఘనంగా మట్టలాదివారం

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**



డిచ్‌పల్లి మండలంలోని బర్దిపూర్ గ్రామంలోని సిఎస్ఐ వెస్లీ చర్చ్ సంఘకాపరి రెవ. బి. దినాకర్ ఆధ్వర్యంలో అదివారం మట్టలాది వారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం లోని ప్రధాన విధుల గుండ ఊరేగింపు నిర్వహించారు. ఈశమట్టలు చేతపట్టుకొని పిల్లలు, మహిళలు, వద్దులు ఉత్సహంగా పాల్గొన్నారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంతో కమిటి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కైరో ప్రాక్టీస్ సెంటర్ ప్రారంభం

**నవతెలంగాణ-ఆర్మూర్**

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తాలో హెల్త్ కేర్ ఫిజియో రీహబ్‌లో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ రమేష్ చేతుల మీదుగా కైరో ప్రాక్టిక్స్ సెంటర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మొట్టమొదటి కైరో ప్రాక్టిక్స్ సెంటర్ ను ఆర్మూర్ ప్రాంతంలో ప్రారంభించడం చాలా ఆనందదాయకమన్నారు. కైరో ప్రాక్టిక్స్, ఆస్తియోపతి అనే అడ్వాన్సు చికిత్స ద్వారా వెన్నుపూసకు సంబంధించిన స్లిప్ డిస్క్, సియాటికా, స్పాండిలైటిస్, లాంటి వెన్నుపూసకు సంబంధించిన అన్ని సమస్యలకు తక్కువ సమయంలోనే తగ్గించుకునే ఆస్కారం ఉందన్నారు. డాక్టర్ సతీష్ ఫిజియోథెరపిస్ట్ మాట్లాడుతూ ఈ కైరో ప్రాక్టిక్స్ అస్థియోపతి అనే అడ్వాన్స్ చికిత్స ద్వారా చాలా ఉపయోగకరమైనది అన్నారు. ఈ ప్రాంత ప్రజలు వినియోగించుకోగలరని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి సాయి ప్రతాప్, గంగాధర్ పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి : టీఎస్ యూటీఎఫ్

**నవతెలంగాణ-భీమ్‌గల్**

ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల అన్ని రకాల బిల్లులను మార్చి 31వ తేదీలోగా చెల్లించాలని టిఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్క జనార్దన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం నాడు భీమ్‌గల్‌లో విలేరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు వివిధ వ్యక్తిగత , ఆరోగ్య అవసరాల కోసం జీపిఎఫ్, టిఎస్ జిఎల్ఐ రుణాల కోసం దరఖాస్తు చేసుకొని సంవత్సరం దాటినా బిల్లులు చెల్లించకపోవడం సరికాదని వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. పదిహేను వాయిదాల పిఆర్సీ బకాయిలను, సరెండర్ సెలవుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 2022, 2023 సంవత్సరాలలో ఎస్ఎస్సి స్పాట్ విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వెంటనే పైకం చెల్లించాలని, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు, సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి నెలా మొదటి తేదీన వేతనాలు చెల్లించాలని కోరారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను ఏప్రిల్ 23వ తేదీన రిలీవ్ చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. విద్యాసంవత్సరం ప్రారంభం నాటికల్లా ప్రతి పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలని, ఖాళీగా ఉన్న పోస్టులలో విద్యా వాలంటీర్లను నియమించాలని , విద్యార్థుల నమోదు పెంపు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

## సీఐ, ఎస్ఐకి సన్మానం



సన్మానిస్తున్న మాలసంఘం సభ్యులు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

మాల సంఘం వర్ని రోడ్ ఆధ్వర్యంలో నార్త్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్ ఇటీవలే ఐదవ టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అశోక్‌ను మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. కలిసి శాలువా బొకేతో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రామచందర్ గైక్వాడ్ మాట్లాడుతూ.. సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు కాపాడడానికి తమ వంతు సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ముత్యాల మారుతి, గౌరవ అధ్యక్షులు ఏ.దిగంబర్, కోఆర్డినేటర్ నీరుడి సాయిలు వీరితోపాటు సీమ గంగాధర్, రాజు, శివం కుమార్, మహిళా కార్యదర్శి మోరే కమలాబాయి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఆలయానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న చిల్కసుదర్శన్

**నవతెలంగాణ-ముప్కాల్**

మండల కేంద్ర వాస్తవ్యులైన చిల్క సుదర్శన్ అమ్మవారి మందిరం 'శుక్రవారం దేవుని గుడి' ఆలయ నిర్మాణం కోసం తనవంతు ప్రయత్నంగా రూ.25వేల రూపాయలను విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కంచు విజయ్ మాట్లాడుతూ అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. విరాళ దాత చిల్క సుదర్శన్ కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచు విజయ్, కంచు గంగాధర్, విరాళ దాత కుటుంబ సభ్యులు చిల్క ప్రదీప్, చిల్క వినోద్ తదితరులు ఉన్నారు.

## లాస్య మృతికి కారకులైన వారిని శిక్షించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గోసంగి కులస్తులు

**నవతెలంగాణ-ఆర్మూర్**

పట్టణ కేంద్రంలో సంతోష్‌నగర్‌లో శనివారం వివాహితను గొంతుకోసి హత్య చేసిన సంఘటన తీవ్ర కలవరం రేపగా పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గోసంగి కులస్తులు పెద్ద సంఖ్యలో న్యాయం చేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా గోసంగి సంఘం అధ్యక్షులు గంధం రాజేష్ మాట్లాడుతూ.. మిట్ట మధ్యాహ్నం అత్యంత పాశవికంగా రాసరి లాస్యను గొంతు కోసి చంపడం దారుణమని, దానికి కారకులైన దుండగులను వెంటనే అరెస్ట్ చెయ్యాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా పోలీస్ కమిషనర్‌కు జిల్లా గోసంగి సంఘం తరుపున మెమోరండం ఇచ్చి కేసును నీరుగార్చకుండా పారదర్శకంగా విచారణ చేసి దుండగులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో గోసంగి నాయకులు గంధం గంగాధర్, సదుల రాములు, నిరగొండ సాయిలు, కర్రే లింగస్వామి, గంధం చిరంజీవి, పస్తం రాజన్న, సంతోష్, మిరియాల సతీష్, పోశెట్టి, శ్రీనివాస్ గంగమల్లు తదితరులు పాల్గొన్నారు.

# సూచనలు, ఆదేశాలు..

- టీయూను సందర్శించిన కొత్త వైస్ ఛాన్సలర్
- విద్యార్థులతో మాట్లాడుతూ.. సమస్యలు తెలుసుకుంటూ
- పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసిన టీయూ వీసీ బుర్ర వెంకటేశం



మాట్లాడుతున్న వీసీ బుర్రవెంకటేశం

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

టీయూ వైస్ చాన్సలర్‌గా నియమితులైన బుర్ర వెంకటేశం ఆదివారం తెలంగాణ యూనివర్సిటీని సందర్శించారు. యూనవర్సిటీలో తిరుగుతూ విద్యార్థులతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. వైస్ ఛాన్సలర్ బుర్ర వెంకటేశం వైస్ ఛాన్సలర్ గా నియామకమై మొదటి సారిగా యూనివర్సిటీ కి రాగ తెలంగాణ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. అనంతర వైస్ ఛాన్సలర్ నివాసంలో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జాయింట్ కలెక్టర్ , మున్సిపల్ కమిషనర్, అడిషనల్ కలెక్టర్, ఆర్‌డిఓ తదితర ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ క్రమంలో యూనివర్సిటీ భూమి 70 ఎకరాలు కేసులో ఉన్నదని, 60 ఎకరాలు సారంగాపూర్ భూమికి హద్దులు లేవని రిజిస్ట్రార్ గుర్తుచేయగా ఈ సమస్యను తక్షణం పరిష్కరించాలని వైస్ ఛాన్సలర్ కలెక్టర్‌కు సూచించగా కలెక్టర్ పరిష్కరానికి హామీఇచ్చారు.

**అన్ని బిల్డింగ్‌లను సందర్శించిన వెంకటేశం**

యూనివర్సిటీ పరిసరాల మీద ఉన్న ఆసక్తితో వీసీ బుర్ర వెంకటేశం బాలికల హాస్టల్ బిల్డింగ్స్‌ను సందర్శించి రూసా ద్వారా విడుదలైన 7 కోట్ల తో నూతన బాలికల బిల్డింగ్‌కు ఎన్నికల కోడ్ అనంతరం నిర్మాణ పనులు మొదలు పెట్టాలని సూచించారు.

బాలికల కోసం ఒక ఫిసికల్ డైరెక్టర్ పోస్ట్ ఏర్పాటు కు ప్రతిపాదనలు పంపించాలని రిజిస్ట్రార్ కు సూచించారు. అనంతరం బాలుర వసతి గృహం సందర్శించి విద్యారులతో ముఖాముఖీ సంభాషణ జరిపారు. విద్యార్థులు తమ సమస్యల మీద అందించిన నివేదికను తీసుకొని ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. 2 సంవత్సరాల నుండి ట్యూషన్ ఫీ , మెస్ చార్జీలు బకాయిలు ఉన్నాయని విద్యార్థులు తెలియజేయగా వెంటనే విడుదల చేయాలనీ కలెక్టర్‌కు ఆదేశించారు.

ఆ తరువాత సెంట్రల్ లైబ్రరీ తనిఖీలో భాగంగా విద్యార్థులతో కాంపిటేషన్ ఎగ్జామ్స్‌లో గ్రూప్ వన్ గ్రూప్ 2 టెట్ లాంటి ఎగ్జామ్స్‌కు పోటీపడి చదవాలని మీకు ఎలాంటి కావాల్సిన పుస్తకాలు అయినా అందుబాటులోకి తెచ్చే విధంగా కృషి చేస్తున్నామని విద్యార్థులకు వివరించారు. నూతనంగా నిర్మిస్తున్న సైన్స్ కళాశాల బిల్డింగును



పనుల వివరాలు తెలుసుకుంటున్న వీసీ

పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న సైన్స్ కళాశాల బిల్డింగ్ లో ఎలాంటి నాణ్యత లోపాలు ఉండరాదని అధికారులను ఆదేశించారు. 2 వ అంతస్తులో సెమినార్ హల్ కు అంచనా ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. అనంతరం నూతనంగా ఆడిటోరియం నిర్మాణానికి సంబంధించి విలువ అంచనా వేసి నివేదిక పంపించాలని రిజిస్ట్రార్ కు సూచించారు.

2014 లో నియామకమైన బోధన సిబ్బంది పదోన్నతులపట్ల గోవర్నమెంట్ ప్లీడర్ అభిప్రాయం కోసం రిజిస్ట్రార్‌ను లేఖ రాసి త్వరలో సానుకూలంగా పదోన్నతులు పూర్తిచేయాలని సూచించారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది అందించిన నివేదికను తీసుకొని సమ్మె పట్ల అసంతృప్తి వ్యక్తం చేసి 275 పోస్టులకు గాను 47 మాత్రమే మంజూరు అయ్యాయని, మిగిలినవి ప్రభుత్వ నిర్ణయాల ప్రకారం పోస్టుల మంజూరు కు ప్రయత్నిస్తానని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగం మీద ఉన్న ప్రేమతో విశ్వవిద్యాలయాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దాలని తపనతో నిరంతరం రిజిస్ట్రార్ యాదగిరి ద్వారా ఎప్పటికప్పుడు యూనివర్సిటీ లో జరిగే కార్యక్రమాల నివేదిక తెప్పించుకొని సరైన మార్గ నిర్దేశం చేస్తూన్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రొఫెసర్‌లు, అధికారులు ఉన్నారు.

# క్షత్రియ పాఠశాలలో కళా మహోత్సవం

- ఘనంగా వార్షికోత్సవ సంబరాలు

**నవతెలంగాణ-ఆర్మూర్**



నాట్యం చేస్తున్న విద్యార్థులు

మండలంలోని చేపూరు క్షత్రియ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు కళా మహోత్సవ్ వార్షికోత్సవ సంబరాలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, రాష్ట్ర బౌద్ధిక్ సహ ప్రముఖ్ శివ కుమార్, క్షత్రియ విద్యాసంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ వార్షికోత్సవ వేడుకలని ఉద్దేశించి క్షత్రియ విద్యాసంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రెవిన్యూ డివిజన్‌లోని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య, సంస్కారమైన చదువును అందించాలనే లక్ష్యంతో ఆర్మూర్‌లో మొట్ట మొదటి సీబీఎస్సీ పాఠశాలను ప్రారంభించామని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్య పరిపూర్ణ వ్యక్తిత్వం పొంది సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలనే లక్ష్యంతో మా పాఠశాల పని చేస్తుందని అన్నారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి మొదటి బ్యాచ్ విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారని, సంస్కారం లేని చదువు నిరర్థకమని తెలిపారు. అటువంటి విద్యార్థులు సమాజానికి భారమౌతారని, యావత్ ప్రపంచానికి మార్గదర్శనం చేసే శక్తి సామర్థ్యాలు భారత దేశానికి ఉన్నాయని, పండిత్ దీనదాయల్ ఉపాధ్యాయ ఆలోచనలకు అనుగుణంగా తమ విద్యాసంస్థలు పని చేస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. తల్లి-దండ్రులు తమ అమూల్యమైన సలహాలు, సూచనలను అందించాలని అన్నారు. ప్రిన్సిపాల్ లక్ష్మి నరసింహ స్వామి పాఠశాల వార్షిక నివేదికను సోదాహరణంగా చదివి వినిపించారు. ఈ సందర్భంగా ప్రస్తుత విద్య సంవత్సరంలో పాఠ్య, సహ పాఠ్య కార్యక్రమాల్లో విజయం సాధించిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, మెడల్స్ బహూకరించారు. ఈ సందర్భంగా నర్సరీ నుండి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన దైవ, దేశ సైనికుల, రైతు గొప్పతనం, అమ్మ -నాన్న ప్రేమ, ఇతర రాష్ట్రాల సాంప్రదాయాలను ప్రతిబింబించే పలు నృత్య ప్రదర్శనలు కరాటే విన్యాసాలు ఎంతోగానో ఆకట్టుకున్నాయి. వేడుకల్లో సెక్రటరీ, కరెస్పాండంట్ అల్జాపూర్ దేవేందర్, వైస్ చైర్మన్ అల్జాపూర్ లక్ష్మీనారాయణ, కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, డైరెక్టర్స్ అల్జాపూర్ వీరేంద్ర, అక్షయ్, పరీక్షిత్, బ్రాంచ్ ప్రిన్సిపాల్ అరుంధతి, ఇరు పాఠశాలల సిబ్బంది, తల్లితండ్రులు పాల్గొన్నారు.

## సెపక్ తక్రా తెలంగాణ సబ్ జూనియర్ బాలికల జట్టు కెప్టెన్‌గా లాస్యప్రియ



మాట్లాడుతున్న సంజీవ్‌రెడ్డి

**నవతెలంగాణ-మోపాల్**

ఈనెల 25నుండి 30వరకు కర్ణాటక రాష్ట్రంలోని ధవనగిరిలో జరిగే 26వ సెపక్ తక్రా సబ్ జూనియర్ టోర్నమెంట్‌కు జిల్లాకు చెందిన లాస్య ప్రియ కెప్టెన్‌గా వ్యవరిస్తున్నారని జిల్లా సెపక్ తక్రా ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదారి సంజీవరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులకు కిట్టు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెపక్ తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఆర్ ప్రేమ్ రాజ్, హైదరాబాద్ సెపక్ తక్రా అధ్యక్షులు సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గదారి సంజీవరెడ్డి పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జిల్లా క్రీడాకారిణి రాష్ట్ర సబ్ జూనియర్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక పట్ల జిల్లా అధ్యక్షులు కేశ వేణు, ఉపాధ్యక్షులు దీపిక, ల్యాబ్ గంగారెడ్డి, సంయుక్త కార్యదర్శి మీసాల ప్రశాంత్ కుమార్ పలు క్రీడా సంఘాలవారు హర్షం వ్యక్తం చేశారు.

## ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

**నవతెలంగాణ-భీంగల్**

తన బంధువుల కేసు విషయమై భీంగల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్, బి ఆర్ ఎస్ పార్టీ దళిత నాయకుడు నాయకుడు పర్సన్ నవీన్ పై చేయి చేసుకోవడంతో పాటు బూతులు తిట్టిన ఎస్సై హరిబాబు పై తక్షణమే చర్యలు తీసుకోవాలని మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పల్లికొండకి చెందిన తన బంధువుల కేసు విషయమై ఈనెల 18న భీంగల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన నవీన్ కేసు విషయమై ఎస్సై హరిబాబును వివరణ అడగగా కోపోద్రిక్తుడైన ఎస్సై నవీన్ పై చేయి చేసుకోవడంతో పాటు బూతులు తిట్టిన ఎస్సై పై ఫిర్యాదు చేసి మూడు రోజులు గడుస్తున్నా ఇప్పటికి చర్యలు తీసుకోకపోవడం సరికాదు అని అన్నారు. ఇప్పటికైనా అధికారులు విచారణ చేపట్టి ఎస్సై పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నరసయ్య, నాయకులు కన్నె సురేందర్ శర్మా నాయక్, నరసయ్య తుక్కాజీ మండల నాయకులు ఉన్నారు.

## ఆర్మూర్ ఏసీపీకి సన్మానం

**నవతెలంగాణ-ఆర్మూర్**



ఏసీపీని సన్మానిస్తున్న ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు

మండల పరిధిలోనిలోని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు ఏసీపీ బస్వారెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. విద్యా ప్రమాణాల స్థాయి పెంచాలని, ప్రతి విద్యార్థికి సమాజ సేవ పట్ల అవగాహన కలిగి ఉండే విధంగా విద్యా బోధన కొనసాగాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు భరత్ చంద్ర మల్లయ్య, కార్యదర్శి విద్యా ప్రవీణ్ పవార్ జిల్లా బాధ్యులు కాంతి గంగారెడ్డి, మానస గణేష్, విద్య గోపి కృష్ణ, నలందప్రసాద్, శ్రీ మోడల్ స్కూల్ మల్లేష్ గౌడ్, లిల్లీపుట్ రామకృష్ణ, ప్రజ్ఞ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# కుల, మతోన్మాదం నుంచి దేశాన్ని రక్షించుకోవాలి

- పీడిఎస్‌యూ, పివైఎల్, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**



నిజామాబాద్‌సిటీ : కాగడాలతో ప్రదర్శన చేపడుతున్న నాయకులు



ఆర్మూర్‌లో..

భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా నిజామబాద్ నగరంలో ద్వారక నగర్ పార్టీ కార్యాలయం నుంచి సాయి రెడ్డి పెట్రోల్ బంక్ వద్ద ఉన్న భగత్ సింగ్ విగ్రహం వరకు పీడిఎస్‌యూ, పివైఎల్, ఐఎఫ్టియు ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎం-ఎల్ )న్యూడెమోక్రసీ నగర సీనియర్ నాయకులు పరుచూరి శ్రీధర్ మాట్లాడుతూ.. ఈ దేశ వనరులు ఈ దేశానికే ఉండాలని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాలని, యువకులు కామ్రేడ్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని అన్నారు. నేటి పాలకవర్గాలు విదేశీ జపం చేస్తూ సామ్రాజ్యవాద తొత్తులుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ దేశ వనరులను సామ్రాజ్యవాద దేశాలకు అప్పనంగా దోచిపెడుతున్నారని అన్నారు, ఈనాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విదేశీ సామ్రాజ్యవాద దేశాలకు తొత్తులుగా మారి ఈ దేశ వనరులను అప్పగిస్తున్నారని, వారికి వ్యతిరేకంగా నిజమైన దేశభక్తిని ప్రదర్శించి వచ్చే ఎన్నికల్లో సామ్రాజ్య దేశాలకు అనుకూలంగా ఉన్నవారికి తగిన బుద్ధి చెప్పాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నరపు రాజేశ్వర్,పి. వై ఎల్ జిల్లా అద్యక్షులు వనమాల సత్యం, ఐ ఎఫ్ టి యు జిల్లా సహాయ కార్యదర్శి శివకుమార్, ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డి, ప్రజా సంఘాల నాయకులు గొంట్యాల రమేష్, భాస్కర్, దేవిక, వంశీ, మురళి, రాజు, శంకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు,

**ఆర్మూర్:**పట్టణంలో భగత్‌సింగ్ రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా పట్టణంలో శనివారం రాత్రి మామిడిపల్లి చౌరస్తా నుండి గాంధీనగర్ భగత్ సింగ్ విగ్రహం వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. విగ్రహానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ (ప్రజా పంద) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి దేవరం, జిల్లా నాయకులు ముత్తన్న.. సబ్ డివిజన్ కార్యదర్శి కిషన్‌లి లు మాట్లాడుతూ... భారతదేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కుల, మతోన్మాద ఫాసిజానికి వ్యతిరేకంగా జాతీయోద్యమ వీరులైన షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల పోరాట స్పూర్తితో నేటి విద్యార్థి, యువత పోరాడి, కుల మతోన్మాద కత్తుల నుండి దేశాన్ని రక్షించుకోవాలని అన్నారు. భారతదేశాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఈస్ట్ ఇండియా కంపెనీ పేరిట దోచుకుంటే, నేడు భారత పాలకులైన బిజెపి ప్రభుత్వ సహకారంతో ఆదాని, అంబానీ, టాటా, బిర్లా లాంటి అనేక బహుళ జాతి కంపెనీలు దేశ ఆర్థిక వ్యవస్థను దోచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ఆర్‌సి, ఎన్‌పిపి లాంటి చట్టాలను తీసుకువచ్చి దేశ ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్నారని తీవ్రంగా ఆక్షేపించారు. విద్యార్థుల మెదళ్లలో కుల, మత విష బీజాలు నాటేందుకు, విద్యారంగాన్ని పూర్తిగా కాషాయీకరించేందుకు నూతన జాతీయ విద్యా విధానం 2020ని తీసుకువచ్చారని తెలిపారు. స్వేచ్ఛ, సమానత్వ సమాజ స్థాపన కోసం జాతీయోద్యమ వీరులైన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల పోరాట స్ఫూర్తితో విద్యార్థి, యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు ఎం. నరేందర్, జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్, పి వై ఎల్ జిల్లా కార్యదర్శి రవి, జిల్లా నాయకులు మోహన్, ఏఐపికెఎస్ మామిడిపల్లి గ్రామ అధ్యక్షుడు సత్యం, పిడిఎస్‌యూ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు అనిల్, నిఖిల్, నాయకులు పాల్గొన్నారు.